19న యూఎస్‌ఏ అడ్మిషన్ డే

వివరాలను వెల్లడిస్తున్న ఉమ

ఖైరతాబాద్, మార్చి 17 : యూని ఎక్స్‌పర్ట్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న యూఎస్‌ఏ, కెనడా అడ్మిషన్ డే నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ఆపరేషన్ హెడ్ ఉమ తెలిపారు. ఆదివారం సోమాజిగూడలోని ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. సరైన అవగాహన లేక విదేశీ విద్య కోసం వేరే దేశం వెళ్లినప్పుడు విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎర్కొంటున్నారని తెలిపారు. అలాంటి వారికి ఉచితంగా వీసా రిక్రూట్ మెంట్స్, అడ్మిషన్స్, స్కాలర్‌షిప్, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

20న శోభన్‌బాబు చిత్ర గీతాలాపన

రవీంద్రభారతి, మార్చి 17 : శోభన్‌బాబు దివ్య స్మృతిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సీల్‌వెల్ కార్పొరేషన్-ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న మధ్యాహ్నం 2.30 నుంచి రాత్రి 10గంట వరకు చిత్రగీతాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి..

- ఖైరతాబాద్ జోన్‌లో 38 కేంద్రాలు..
- హాజరుకానున్న 8 వేలమందికిపైగా విద్యార్థులు
- గ్రేస్ టైమ్‌లో 5 నిముషాలు ఆలస్యంగా అనుమతి..

10వ తరగతి పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ చిరంజీవి

జూబ్లీహిల్స్, మార్చి 17: నేటినుంచి జరగనున్న పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ డీఈఓ సామ్యూల్ రాజ్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులతో పాటు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశామని తెలిపారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, టాయిలెట్లు, తదితర సౌకర్యాలు కల్పించామని తెలిపారు. విద్యార్థులు మొదటిరోజు గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

ఖైరతాబాద్ జోన్‌లో..

పది పరీక్షలకు ఖైరతాబాద్ జోన్‌లో 38 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్-1, ఖైరతాబాద్-2, షేక్‌పేట్ మండలాల పరిధిలో 8 వేలమంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఆయా కేంద్రాల్లో 38 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 38 మంది చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు, 200 మంది విద్యార్థులకు 10 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. నేటినుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్న పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు అధికారులు తెలిపారు.

5 నిముషాలు గ్రేస్ పీరియడ్..

నేటినుంచి ప్రారంభం కానున్న పది పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. తెలుగు, ఉర్దూ కాంపోసిట్ పరీక్షలు మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరగనున్నాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 5 నిముషాలు గ్రేస్ పీరియడ్ ఇస్తున్నారు. సమయానికంటే ముందే హాజరు కావాలని.. అనుకోని సంఘటన జరిగితే 5 నిముషాలు ఆలస్యంగా అనుమతిస్తామని ముషీరాబాద్ డిప్యూటీ డీఈఓ చిరంజీవి తెలిపారు.

పరీక్షలకు సర్వం సిద్ధం

అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 17: పదవ తరగతి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సిద్ధమైయ్యారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సెంటర్లను సిద్ధం చేసి కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఇప్పటికే పరీక్షా కేంద్రాలను పరిశీలించుకున్నారు . పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంచినీరు, ఫ్యాన్‌లు, బెంచీలు, టాయిలెట్స్ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నారు. పరీక్షల సందర్భంగా విద్యార్థుల గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. పరీక్షల నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

లేక్‌వ్యూ పార్కులో వాకర్స్‌తో మాట్లాడుతున్న అధికారులు

లేక్ పార్కును సందర్శించిన హెచ్ఎండీఏ అధికారులు

ఖైరతాబాద్, మార్చి 17 : ఖైరతాబాద్‌లోని లేక్‌వ్యూ పార్కును ఆదివారం హెచ్ఎండీ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ వి భాగం డైరెక్టర్ ప్రదీప్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ విశ్వప్రసాద్, డిప్యూటీ రేంజ్ అధికారిణి రాణిరుద్రమదేవితో కలిసి పార్కును పరిశీలించి.. వివరాలు తెలుసుకున్నారు. వాకర్స్‌కు సరైన సౌకర్యాలు లేవని, నీటి కొలనులో గుర్రెపు డెక్క వచ్చిందని, వాష్‌రూమ్ సదుపాయం లేదని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

రుమటాలజీపై అవగాహన కల్పించాలి

బంజారాహిల్స్, మార్చి 17 : చిన్నారులకు రుమటాలజీ సమస్యలు సంక్రమిస్తున్నాయని, ఈ వ్యాధిపై తల్లిదండ్రులకు అవగాహన అవసరమని, పీడియాట్రిక్ రుమటాలజిస్ట్, ఇమ్యూనాలజిస్ట్ డాక్టర్ అంజనీ గుమ్మడి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని అంకురా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డాక్టర్ అంజనీ మాట్లాడుతూ.. యూఎస్‌లో ప్రతి వెయ్యిమందిలో నలుగురు చిన్నారులు ఈ సమస్యతో బాధపడుతున్నారన్నారు. అవగాహన లేకనే ఈ వ్యాధి నుంచి కోలుకోలేకపోతున్నారన్నారు. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్ పాల్గొన్నారు.

గ్రామీణ హస్తకళా వికాస్ సమితి ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని రోడ్ నం.12లో ఏర్పాటు చేసిన ప్రదర్శనను టాలీవుడ్ నటి ప్రియాంక రామణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యు వతులు సిల్క్, హ్యాండ్లూమ్ తదితర వస్త్రాలు ధరించి ఆకట్టుకున్నారు. -బంజారాహిల్స్

'సూపర్ సీనియర్ సిటిజన్స్' పురస్కారాలకు దరఖాస్తులు

అమీర్‌పేట్, మార్చి 17 : సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రత్యేకత చాటుతున్న వయోధికులకు 'సూపర్ సీనియర్ సిటిజన్స్' పేరుతో ఉగాది పురస్కారాలను అందిస్తున్నట్లు నిర్వాహకులు జేఎస్‌టీ సాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ కార్యక్రమంలో 60 నుంచి 80 ఏండ్ల మధ్య వయసు ఉండి స్వచ్ఛందంగా సామాజిక సేవా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వయోధికులు ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తులను పంపాలని కోరారు. వివరాలకు 9440894873 (జేఎస్‌టీశాయి), 9491117461 (పార్థసారథి), 98665 20761 (ఆర్‌సీ కుమార్)లలో సంప్రదించాలన్నారు.

ఏఆర్‌టి సెంటర్: ప్రభుత్వ జనరల్ మరియు చెస్ట్ హాస్పిటల్, హైదరాబాద్

నోటిఫికేషన్ [స్టాఫ్ నర్స్ పోస్ట్ (01)]

అర్హత: జనరల్ నర్సింగ్ (GNM)/B.Sc. నర్సింగ్

అనుభవం: GNM/B.Sc.లో 5 సంవత్సరాల అనుభవం మరియు HIV/AIDS రంగంలో 1 సంవత్సరం అనుభవం.

ఇది పూర్తిగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన, ఆసక్తి ఉన్న వారు ART సెంటర్‌లో సంబంధిత పత్రాలను దరఖాస్తు చేసుకోండి. అభ్యర్థులు నోటిఫికేషన్ తేది నుండి 10 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేయబడింది.

సం/-

సూపరింటెండెంట్

ART సెంటర్, ప్రభుత్వ జనరల్ మరియు ఛాతీ ఆసుపత్రి, హైదరాబాద్

చలివేంద్రం ప్రారంభోత్సవంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

రాజీవ్‌నగర్‌కాలనీలో చలివేంద్రం ప్రారంభం

ఎర్రగడ్డ, మార్చి 17: ఎర్రగడ్డ డివిజన్, రాజీవ్‌నగర్ కాలనీ చౌరస్తా వద్ద చలివేంద్రాన్ని కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎం.సురేశ్‌చంద్ర.. తన తల్లిదండ్రులైన ఎంవీ సుబ్బారావు, ఎంవీఎస్ రాజ్యంల జ్ఞాపకార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కృష్ణశర్మ, అధ్యక్షుడు వినయసాగర్, కోశాధికారి మోహన్ రావు, ఉపాధ్యక్షులు భుజంగరావు, బద్రుద్దీన్, సంయుక్త కార్యదర్శి వివేకానంద, నరసింహారావు, యోగా గురువు ముసలినాయుడు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ చలివేంద్రాన్ని సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మ సందర్శించారు.

పోలీసులకు సహకరించాడని దాడి..

వెంగళరావునగర్,మార్చి17: అలర్ల విచారణకు వచ్చిన పోలీసులకు సహకరించాడనే నెపంతో ఓ వృద్ధుడిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలోని సాయి తెలుగు బాలుర హాస్టల్‌లో అన్నం నాగేశ్వరరావు (67) గత 3 మాసాలుగా నివాసం ఉంటున్నాడు. ఇటీవల ఒక గొడవకు సంబంధించి విచారణకు వచ్చిన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో కక్షగట్టిన ఎస్.వి.హెచ్ హాస్టల్ యజమాని.. అతని భార్య, కొడుకు అతన్ని రోడ్డుపై అడ్డుకుని దుర్భాష లాడారు. హాస్టల్‌లోకి వచ్చి మరీ అన్నం తినేటప్పుడు కాళ్ళతో తన్ని దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి

ఖైరతాబాద్, మార్చి 17 : రాజ్యాధికారం దిశగా కాపులు అడుగులు వేయాలని కాపు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీరాములు పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కాపుల ఓట్లు 1.42 కోట్లు ఉంటాయని, పార్టీల గెలుపోటములను నిర్ణయించే సత్తా ఉంటుందన్నారు. తమ ఓట్లతో గద్దెనెక్కుతున్న నేతలు ఎన్నికల తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుత ఎన్నికల సమయంలో కాపు నాయకులకు అండగా నిలబడాల్సిన ముద్రగడ పద్మనాభం వైఎస్ఆర్‌సీపీ చెంతన చేరడం బాధాకరమన్నారు. ఆయన కాపుల ద్రోహిగా, చరిత్ర హీనుడిగా మిగిలిపోతారన్నారు. కాపులకు ద్రోహం చేసే పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధిచెబుతామన్నారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో కాపు సంక్షేమ సంఘం జిల్లా, మండల, పట్టణ కమిటీలు వేస్తామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న పులి శ్రీరాములు

పల్లెచెరువులో బోనాల వేడుకలు

పల్లెచెరువులో జరిగిన బోనాల జాతర పూజలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 17: పల్లెచెరువులో బోనాల వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, పల్లెచెరువులో గంగపుత్ర సంఘం, మత్స్యశాఖ పరిశ్రమ సహకార సంఘం ఆధ్వర్యంలో సామూహిక బోనాల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేసి అలంకరించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సంఘం సభ్యులు ఏర్పాట్లు చేశారు. మహిళలు సామూహికంగా బోనాలను తీసుకువచ్చి దేవాలయంలో సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి , గంట శంకర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పాండుయాదవ్, శంకర్‌రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శాంతినగర్ కాలనీ అసోసియేషన్ కార్యవర్గం

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ శాంతినగర్ కాలనీ నూతన అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీ ప్రజలందరూ కలిసి అధ్యక్షుడిగా నగేశ్, కార్యదర్శిగా వినేశ్‌గౌడ్, కోశాధికారిగా కోటేశ్వర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ.. శాంతి నగర్ కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. - బండ్లగూడ,మార్చి 17

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 17: విద్యార్థులను ఉత్తమ పౌరులుతా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాటేదాన్ వెంకటేశ్వర కాలనీలోని విశ్వశాంతి గ్లామర్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి , పాఠశాల కరస్పాండెంటె కె.కరుణాకర్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, అయోధ్య నృత్యాలు, స్కిట్స్ ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు జెన్నా విజయ్‌చందర్, క్రాంతికిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులువారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్,మార్చి17: రాష్ట్రంలోని శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేంపావని కోరారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు తమ హక్కులు సాధించుకుంటూ, సమస్యలను సైతం పరిష్కారం చేసుకునేందుకు నిత్యం ప్రభుత్వాలను ప్రశ్నిస్తూనే ఉండాలని, మతం పేరుతో ప్రజల్ని మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాధికారంలో మహిళలు భాగస్వాములను చేసినప్పుడే దేశం మరింత సమగ్ర అభివృద్ధి చెందుతుందని, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ఐక్యంగా మహిళలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

'అనుమతులున్నా.. వేధిస్తున్నారు'

బంజారాహిల్స్, మార్చి 17 : జీహెచ్ఎంసీ నుంచి అన్ని అనుమతులు ఉన్నా.... ఆ శాఖ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని వేమిరెడ్డి ఎన్‌క్లేవ్ సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి నరసింహా రెడ్డి ఆరోపించారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపాధ్యక్షుడు ఎంఎల్ అగర్వాల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా బల్దియా అనుమతులతోనే తాము కాలనీలో నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. గత మూడు రోజులుగా గుర్తుతెలియని వ్యక్తుల ప్రమేయంతో నిర్మాణాలను నిలిపివేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ఇక్కడి వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వేమిరెడ్డి ఎన్‌క్లేవ్‌కు సంబంధించిన సర్వే నం. 129/68 స్థలంపై ఇప్పటికే సుప్రీం కోర్టు తమకు అనుగుణంగా తీర్పునిచ్చిందని, జోక్యం చేసుకునే అధికారం జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులకు లేదన్నారు. ఈ విషయంపై త్వరలోనే కాలనీ వాసులతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, ఆర్టీవోలను కలిసి సుప్రీం కోర్టు తీర్పు పత్రాలను అందజేస్తామన్నారు.

ఆస్తిపన్ను వివాదాలు పరిష్కరించుకోవాలి..

ఆస్తిపన్ను పరిష్కార వేదికలో డీసీలు సేవా ఇస్లావత్, రవికుమార్

యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఆస్తిపన్ను ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ సేవా ఇస్లావత్

ఫిర్యాదులు తీసుకుంటున్న రాజేంద్రనగర్ డీసీ రవికుమార్

జూబ్లీహిల్స్, మార్చి 17 : ఆస్తిపన్ను వివాదాలను ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార వేదికలో పరిష్కరించుకోవాలని యూసుఫ్‌గూడ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. మార్చి మాసంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ వేదికలో భాగంగా మార్చి 24న చివరి ఆస్తిపన్ను పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ కార్యాలయంలో ఆస్తిపన్ను పరిష్కార వేదిక నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ క్యాంప్‌లో వివాదాల పరిష్కారంతోపాటు వన్ టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌లో 2022-23 వరకు ఉన్న ఎరియర్స్‌పై 90 శాతం వడ్డీ మాఫీ పథకంలో బకాయి ఉన్న ఆస్తిపన్ను ఒకేసారి చెల్లించాలని కోరారు. మార్చి మాసంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ వేదికలో భాగంగా మార్చి 24న చివరి ఆస్తిపన్ను పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆస్తిప న్ను వివాదాలు పరిష్కరించుకుని బకాయిలు చెల్లించాలని కోరారు.

సమస్యలను పరిష్కరిస్తున్నాం..

బండ్లగూడ, మార్చి 17: ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నామని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆస్తిపన్ను పరిష్కార వేదికలో భాగంగా 9 ఫిర్యాదులు అందినట్లు ఆయన పేర్కొన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసు కోవ డం జరుగుతుందన్నారు. ఆర్థిక సంవత్సరం సమీపిస్తుండటంతో ఆస్తిపన్ను చెల్లింపుదారు లు తమ పన్నులను చెల్లించాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించుకుందాం..

మణికొండ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో తీర్మానం

మణికొండ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో సభ్యులు

మణికొండ, మార్చి 17: మణికొండ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సీతారాం ధూళిపాళ అధ్యక్షతన సాయిరాం కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు అకాల మరణం పట్ల ఆయనకు నివాళులర్పించారు. అనంతరం కార్యదర్శి ఆంజనేయులు సమాఖ్య వార్షిక నివేదికను సమర్పించి.. మణికొండలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించి తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికి తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించినప్పటికి.. వారు ఉదాసీన వైఖరి, సమన్వయ లోపం కారణంగా మంచినీటి విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ, మున్సిపాలిటీ, హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులు ప్రజా అవసరాలకు అనుగుణంగా తగినన్ని వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచి, వాటి ధరలను నియంత్రించడం, నీటిని పొదుపుగా వాడాలని ప్రచారం చేయడం, ఇంకుడు గుంతలు నిర్మించడం, కొత్త కట్టడాల సమయంలోనే ఇంకుడు గుంతలు నిర్మించాలని నిర్దేశించడం, నీటిని వృథా చేసేవారిపట్ల చర్యలు చేపట్టడం, కొత్త రిజర్వాయర్లను అందుబాటులోకి తీసుకురావడంలాంటి చర్యలు తక్షణమే అమలు చేయాలని తీర్మానించారు. సమాఖ్య తరపున త్వరలో వాటర్‌వర్క్స్ ఎండిని కలిసి మంచినీటి ఎద్దడిని నివారించడం కోసం చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేయనున్నామన్నారు. మంచినీటి కనెక్షన్ ఉన్న ప్రతి ఇంటికి తక్షణమే క్యాన్‌నంబర్లు అందజేయాలన్నారు. మణికొండ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు పందెం వాగులోకి ప్రవహిస్తున్న కారణంగా.. సమగ్ర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నెలకొల్పాలని తీర్మానం చేశారు. మణికొండ ఫ్రెండ్స్ కాలనీ, ఆంధ్రాబ్యాంక్ జంక్షన్, మర్రిచెట్టు నుంచి ఓయూ కాలనీ రోడ్‌లో ట్రాఫిక్ సమస్యలు తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైల్స్ దగ్గర బాక్స్ డ్రైన్ నిర్మాణ జాప్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గడిచిన కొద్ది సంవత్సరాలుగా పలుమార్లు ఇంటిపన్ను మదింపు విధానం అవకతవకలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన తమకు నచ్చిన రీతిలో ఇంటి పన్ను విధిస్తున్న కారణంగా కాలనీ సంఘాలు తీవ్రంగా ఆక్షేపించాయి. సాయిరాం కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రాంతాల్లో హోటల్స్, వైన్స్ షాపులకు లైసెన్స్‌లు ఇవ్వడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా ఫాంహౌస్‌లో మద్యం

ఇద్దరు వ్యక్తుల అరెస్టు

శంషాబాద్ రూరల్, మార్చి 17 : అక్రమంగా ఫాంహౌస్‌లో మద్యం ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు దానిపై దాడిచేసి ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేశారు. శంషాబాద్ రూరల్ సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం, పోశెట్టిగూడ గ్రామంలోని నవీ ఫాంహౌస్‌లో ఎలాంటి అనుమతి లేకుండా మద్యం సేవిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఆ ఫాంహౌస్‌పై దాడిచేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని, రోహిత్, రాజశేఖర్‌లను అదుపులోకి తీసుకుని.. పోలీసులకు అప్పగించారు.

యువకుడు అదృశ్యం

వినోద్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, మార్చి 17 : ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన ఆదివారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం, పామాపూర్ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం తన కుటుంబ సభ్యులతో కలిసి ఊటుపల్లి గ్రామంలో నివాసముంటున్నాడు. అయితే.. అతడి కొడుకు వినోద్ ఫిబ్రవరి 27న కొత్త పల్సర్ బైక్‌ను తీసుకొని ఇంటికి వచ్చాడు. దీనికి డబ్బులు ఎక్కడి నుంచి తీసుకున్నాయని ప్రశ్నిస్తే ఆదే రోజు మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో గాలించినా ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుస్తులు, అంబలి పంపిణీ

బన్సీలాల్‌పేట్, మార్చి 17 : పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్ల పక్కన ఉంటున్న నిరాశ్రయులు, అనాథలకు దుస్తులు, పాదచారులకు అంబలి, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రతి ఆదివారం అంబలి పంపిణీ చేస్తామన్నారు.